

బస్సుపాస్ చార్జీలు తగ్గించాలి

సిరిసిల్లటౌన్: పెంచిన బస్‌పాస్ చార్జీలు తగ్గించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం డిపో ఎదుట ధర్నా చేశారు. రవిగౌడ్ శ్రీనివాస్, సాయికుమార్ ఉన్నారు.



భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను బుధవారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారి హుండీలలో భక్తులు వేసిన కట్నాలు, కానుకలను గురువారం లెక్కించనున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

సర్కారు బడికే జై

- బడిబాటతో పెరిగిన ప్రవేశాలు
- కొత్తగా 1,276 అడ్మిషన్లు
- ప్రైవేట్‌లో ఫీజుల మోతతో తల్లిదండ్రుల వైఖరిలో మార్పు
- ప్రభుత్వ పాఠశాలల వైపు చూపు
- నేటి నుంచి తెరుచుకోనున్న బడులు



సిరిసిల్లలో ఉపాధ్యాయ సంఘాల బడిబాట ర్యాలీ

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్న ఫలితాలు.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు.. ప్రైవేట్‌లో బాదుతున్న ఫీజుల మోతతో తల్లిదండ్రుల వైఖరిలో మార్పు వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకొస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బడిబాటలో జిల్లా వ్యాప్తంగా కొత్తగా 1,276 అడ్మిషన్లు రావడమే ఇందుకు నిదర్శనం. గతేడాది 183 రాగా.. ప్రస్తుతం ఇంత పెద్ద మొత్తంలో ప్రవేశాలు రావడంతో గురువారం నుంచి తెరుచుకోనున్న స్కూళ్లకు ఉపాధ్యాయులు రెట్టించిన ఉత్సాహంతో వెళ్తున్నారు. రెండు నెలల పాటు వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు.

సర్కారు బడులే నయం

ఫీజుల నుంచి మొదలుకొని చదువుల విషయంలో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుండడంతో ప్రభుత్వ బడుల వైపు తల్లిదండ్రులు చూస్తున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి మొదలైన బడిబాట కార్యక్రమాన్ని చేపట్టగా.. తల్లిదండ్రుల నుంచి స్పందన బాగుంది. గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1,276 కొత్త అడ్మిషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతేడాది జూన్ 12 వరకు కొత్తగా 183 ప్రవేశాలు రాగా.. ఈ యేడు బడులు తెరువక ముందే ఇంత పెద్ద మొత్తంలో అడ్మిషన్లు రావడం విశేషం.



పెద్దూరులో బడిబాట

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

ప్రభుత్వ బడులతోపాటు గురుకుల పాఠశాలలను పటిష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల విద్యార్థుల మెస్ చార్జీలు పెంచింది. గురుకుల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు, తమ సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపేందుకు ఫోన్‌మిత్రను ప్రవేశపెట్టింది. ఇక అన్ని ప్రభుత్వ బడుల్లో ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్కులు ఇతర సామగ్రిని అందజేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ బడుల్లో 2,70,587 పుస్తకాలు అవసరం ఉండగా..ఇప్పటికే 2,58,419 పుస్తకాలు చేరుకున్నాయి. నోట్‌బుక్కులు 3,07,765 అందుబాటులో ఉన్నాయి. ఒకటి నుంచి ఐదోతరగతి వరకు వర్క్‌బుక్స్ 52,354 అవసరం ఉండగా..34,237 అందాయి. యూనిఫామ్స్ 39,039 అవసరం కాగా 38,600 అందించారు. మధ్యాహ్న భోజనం, రాగిజావ, అల్పాహారం, కంప్యూటర్ విద్య, మరికొన్ని పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల వంటి వసతులు కల్పించారు.

జిల్లా సమాచారం	
ప్రభుత్వ పాఠశాలలు	: 511
గురుకులాలు	: 22
కేజీబీవీలు	: 13
మదర్సా	: 01
ప్రైవేటు స్కూళ్లు	: 122
బడిబాటలో ప్రవేశాలు	: 1,276
గతేడాది విద్యార్థులు	: 80,108

మానవ విలువలతో కూడిన విద్య



మా పాఠశాల రోజుల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పౌష్టిక విలువలు గల ఉప్మా, పాలు, కోడిగుడ్లు అందించేవారు. హెడ్‌మాస్టర్‌ను గ్రామపెద్దతో సమానంగా చూసేవారు. మానవ విలువలతో కూడిన విద్యనందించారు. ప్రభుత్వ బడుల్లో అందుతున్న నాణ్యమైన విద్యను తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ విద్య పటిష్టంతోనే సమసమాజస్థాప సాధ్యం.

– గుడ్ల రవి, విశ్రాంత ఉపాధ్యాయుడు, సిరిసిల్ల

సౌకర్యాలు కల్పిస్తున్నాం



సీఎస్‌ఆర్ నిధుల ద్వారా పాఠశాలలో నూతన గదుల సముదాయం నిర్మాణం జరుగుతుంది. బడులు ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలి. బోర్‌వేశారు కానీ మోటార్ బిగించాల్సి ఉంది. పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నాం. బడిబాట ద్వారా అడ్మిషన్లు పెంచుతున్నాం.

– సిలుముల శంకర్, హెచ్‌ఎం, తంగళ్లపల్లి

మనసు చలించిపోతోంది !



ఏడాది క్రితం మూతపడ్డ రహీంఖాన్‌పేట ప్రాథమిక పాఠశాల

- నా పిల్లలే పట్టించుకోకపోతే ఎవరికీ చెప్పుకునేది

ఇల్లంతకుంట(మానకొండూర్): సెలవులు రావడంతో రెండు నెలలుగా సందడి లేని స్కూళ్లు ఈరోజు జీవకళ సంతరించుకుంటున్నాయి. కానీ నేను ఏడాదిగా నా పిల్లలకు దూరంగానే ఉంటున్నాను. నన్ను పలకరించేవారు కరువయ్యారు. వేసవి సెలవులు వస్తేనే పిల్లలు లేక బోసిపోయి ఉండేదాన్ని. ఎప్పుడెప్పుడు సెలవులు ముగుస్తాయా.. అని ఎదురుచూసేదాన్ని. కానీ నా గేట్‌కు తాళం వేయడంతో ఎన్నాళ్లకు నాకు పునర్వైభవం వస్తుందోనని ఏడాదిగా ఎదురుచూస్తున్నాను. నేను మీకు గుర్తున్నానా.. అదే రహీంఖాన్‌పేట చిన్నబడిని. ఏడాది క్రితం పిల్లల సంఖ్య తగ్గిందని తాళం వేసి పోయిన మీరు ఇటువైపు చూడడమే లేదు. నా గతాన్ని తలచుకుంటే దుఃఖం ఆగడం లేదు. 1955లో ప్రారంభమైనప్పుడు ఎంతో దర్జాగా ఉండేదాన్ని. రంగురంగుల డ్రెస్సుల్లో పిల్లలు వస్తుంటే నా ఠీవీయే వేరు. ఈ లోకంలో నన్ను మించిన వారు లేరనే భావనతో ఉండేదాన్ని. ఊరిలోని పేద, ధనిక అనే తేడా లేకుండా అన్ని వర్గాల పిల్లలు నా ఒడిలోనే చదువుకొని ఉన్నతంగా ఎదిగారు. అయితే నా ఒడిలో ఓనమాలు దిద్దినవారే.. తమ పిల్లలను ప్రైవేట్‌కు పంపుతుండడం నన్ను కలచివేసింది. పొద్దుగాలనే వస్తున్న ప్రైవేట్ స్కూళ్ల బస్సుల్లో పిల్లలను పంపుతుంటే నా మనసు చలించిపోతోంది. నా ఒడిలో పెరిగి.. విద్యాబుద్ధులు నేర్చిన వారు.. తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తుండడంతో నా హృదయం గాయపడింది.

జర ఆలోచించండ్రి

రెండు వేల జనాభా ఉన్న ఊరిలో పది మంది పిల్లలు కూడా నా దగ్గరికి రాకుండా అయ్యారంటే తప్పెవరిదీ? ఊరిలోకి ప్రైవేటు పాఠశాలల బస్సులు రాగానే పిల్లలు ఎక్కిస్తున్నా తల్లిదండ్రులదా..? పిల్లలు రాకపోతే తల్లిదండ్రులకు మంచి మాట చెప్పి మార్చాల్సింది పోయి మూతవేసిన అధికారులదా..? ఇప్పటికైనా ఆలోచించండ్రి. కనీసం నా ఒడిలో చదువుకుని బాగుపడ్డ పిల్లల్లో ఒక్కరు కూడా పట్టించుకునే వారు లేరా..? చిన్న ఆలోచనే నన్ను బతికేలా చేస్తుంది. ఎవరో ఒక్కరూ ముందుకొస్తేనే కదా.. మార్పు వచ్చేది. ఊరిలోని నన్ను పట్టించుకుంటే ఎలాంటి ఖర్చు లేకుండా.. కడుపునిండా భోజనం పెడుతూ.. వేసుకునేందుకు రెండు డ్రెస్సులు ఇస్తూనే.. నాణ్యమైన చదువు చెబుతాను కదా.. ఈ ఆలోచన నా పిల్లలకు(నా వద్దే చదువుకున్న విద్యార్థులు) ఎందుకు రావడం లేదు. కనీసం నా గోడు వినైనా ఈ యేడు తమ పిల్లలను నా వద్దకు పంపుతారని ఆశిస్తూ..

ఇట్లు

మీకు విద్యాబుద్ధులు నేర్పిన సర్కార్ బడి
(జిల్లాలో మూతపడ్డ ఓ పాఠశాల ఆవేదన ఇదీ..)

ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి



అగ్రహారం మిషన్ భగీరథ వాటర్‌ప్లాంటును పరిశీలిస్తున్న కేంద్ర అధికారుల బృందం, కలెక్టర్

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- మిషన్ భగీరథను పరిశీలించిన కేంద్ర బృందం

సిరిసిల్ల: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. జిల్లాలో బుధవారం కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రెటరీ సెంథిల్ రాజన్ టెక్నికల్ బృందం పర్యటించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి కృషి సంచాన్ యోజన, జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టులపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో పీఎంకేఎస్‌వై కింద చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పురోగతి వివరాలు, మిషన్ భగీరథ, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు వివరాలను కేంద్ర అధికారులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా జిల్లాలో 85 శాతం ఆయకట్టు సృష్టించినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో 333 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మించాల్సి ఉండగా 280 కిలోమీటర్ల పనులు పూర్తి చేశామన్నారు. ఎస్‌ఎస్‌ఆర్ రేట్లు 2008 నాటివి ఉండడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదన్నారు. భూసేకరణకు, డిస్ట్రిబ్యూషన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. డిసెంబర్ 2026 నాటికి ఈ ప్రాజెక్టు చివరి ఆయకట్టు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–9 ద్వారా..

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–9లో మిడ్‌మానేరు రిజర్వాయర్ నుంచి టన్నెల్, లిఫ్ట్ ద్వారా మల్కపేట రిజర్వాయర్ నింపుతామని, ఇక్కడి నుంచి కాల్వల ద్వారా ఎల్లారెడ్డిపేట, మరో 2 మండలాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. సమావేశం అనంతరం కలెక్టర్, కేంద్ర అధికారుల బృందంతో కలిసి అగ్రహారం మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, నీటి పారుదల ప్రాజెక్టులను, ముస్తాబాద్ మండలం కొండాపూర్, మోర్రాయిపల్లి గ్రామాల్లోని నీటి ట్యాంకులు, గ్రిడ్ ద్వారా నీటిని సరఫరా చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ బృందం రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనుంది. ఈఈ జానకి, డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో బీరయ్య, డీఈలు ఉన్నారు.

కోడెలను పక్కదారి పట్టిస్తే చర్యలు

వేములవాడఅర్బన్: కోడెలను పక్కదారి పట్టిస్తే చర్యలు తీసుకుంటామని, వ్యవసాయ పనులకు మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. తిప్పాపూర్‌లోని గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు పరిశీలించి, అర్హులకు 190 జతల కోడెలను బుధవారం పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

న్యాయవాదులు ఆరోగ్య స్పృహ పెంచుకోవాలి



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న జిల్లా న్యాయమూర్తి పి.నీరజ

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: న్యాయవాదులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ కోరారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి వైద్యశిబిరం ప్రారంభించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం 200 మంది న్యాయవాదులు శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ బీరకాయల లోకేశ్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత వైద్యపరీక్షలు చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రవీణ్, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కావేటి సృజన, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.8లక్షలు ఇవ్వాలి

సిరిసిల్లఅర్బన్: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షలు సరిపోవడం లేదని.. రూ.8లక్షలకు పెంచాలని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ ఆఫీస్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ హయాంలో సగం వరకు ఇళ్లు నిర్మించుకున్న ఆగిపోయిన లబ్ధిదారులను సైతం ప్రస్తుతం అర్హులుగా గుర్తించాలని కోరారు. పోచమల్లు, సాయిలు, రాజయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే



ప్రతిభ చూపిన విద్యార్థులతో టౌన్ సీఐ వీరప్రసాద్, కరాటే మాస్టర్ మన్నాన్

వేములవాడ: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని మహదేవ ఫంక్షన్‌హాల్లో బుధవారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టుల్లో నెగ్గిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కరాటే మాస్టర్ మన్నాన్, కోచ్‌లు రాజు, రాజశేఖర్, వర్షిత్, రిషికేజ, సూర్య జయచంద్ర పాల్గొన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా బుధవారం చిరుజల్లులు కురిశాయి. బోయినపల్లిలో 6.4 మిల్లీమీటర్లు, చందుర్తిలో 0.4, రుద్రంగిలో 1.2, వేములవాడ రూరల్‌లో 2.0, వేములవాడలో 1.5, సిరిసిల్లలో 1.8, కోనరావుపేటలో 0.6, వీర్నపల్లిలో 1.6, ఎల్లారెడ్డిపేటలో 1.0, ముస్తాబాద్‌లో 0.3, తంగళ్లపల్లిలో 3.5, ఇల్లంతకుంటలో 1.0 మిల్లీమీటర్ల వర్షం పడింది. గంభీరావుపేటలో వర్షం పడలేదు.

చదువుకుంటూ.. శ్రమించే పిల్లలను ప్రోత్సహించాలి

- మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్



రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తున్న రవీందర్

సిరిసిల్ల: చదువుకుంటూ.. సంపాదిస్తూ.. కుటుంబాలకు అండగా ఉండే పిల్లలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆడెపు రవీందర్ పేర్కొన్నారు. పేపర్‌బాయ్స్‌గా పనిచేసే పిల్లలకు బుధవారం రెయిన్‌కోట్స్ పంపిణీ చేశారు. రవీందర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటింటికీ తిరుగుతూ పేపర్ వేయడం ఇబ్బందిగా ఉంటుందని రెయిన్‌కోట్స్ అందించేందుకు ముందుకొచ్చిన దాతలను అభినందించారు. సిరిసిల్ల పట్టణ న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోచంపల్లి రాజు, ఉపాధ్యక్షుడు తడక చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి మల్లేశంగౌడ్, సలహాదారులు బైరి దేవదాస్, యెల్లె రాజేంద్రప్రసాద్, కోశాధికారి గుడెల్లి నాగభూషణం, సహాయ కార్యదర్శి రాగుల వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు బొద్దుల బాలకృష్ణ, పిస్క సాయికుమార్, వెంగళ శ్రీకాంత్, నక్క వెంకటేశ్, చిట్యాల శ్రీహరి, గాజుల అశోక్, తడుక బాలకిషన్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిలో సొంత ఎజెండా లేదు

- అభినవ తీర్థ సదన్‌కు భూమి పూజ చేసిన ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రాజన్న ఆలయ అభివృద్ధిలో తన సొంత ఎజెండా ఏమీ లేదని, ప్రజాభీష్టం మేరకు, శృంగేరిపీఠాధిపతుల అనుమతులతో పనులు చేపట్టబోతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలోని శంకరమఠం వెనుక భాగంలో అనువంశిక అర్చక ట్రస్ట్, బ్రాహ్మణ నిత్యాన్నసత్రం ఆధ్వర్యంలో అభినవ విద్యాతీర్థ సదన్ నిర్మాణం పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాజన్న క్షేత్రంలో బ్రాహ్మణుల కోసం వసతిగృహం ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆలయ అభివృద్ధిపై త్వరలోనే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నామాల లక్ష్మీరాజం, రామతీర్థపు రాజు, గడ్డం నర్సయ్య, రేగుల మల్లికార్జున్, మధు రాధాకిషన్, నరహరిశర్మ, బుడంగారి మహేశ్, పురాణం రాము, మామిడిపల్లి వెంకటేశం, గర్శకుర్తి వెంకటేశం, చంద్రగిరి శరత్, గోపన్నగారి చందు, నమిలకొండ ఉమేశ్, మధు రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అవినీతికి పరాకాష్ట కాళేశ్వరం

- కరీంనగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ చక్రధర్‌రెడ్డి



మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన అవినీతికి పరాకాష్టగా కాళేశ్వరం ప్రాజెక్టు మిగిలిపోయిందని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి విమర్శించారు. ముస్తాబాద్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పతనం ప్రారంభమైందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల పాలుచేశారని ఆరోపించారు. విచారణ కమిషన్ ఎదుట వాస్తవాలు చెప్పి, ప్రజలకు నిజాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన వారందరు జైలుకు వెళ్లక తప్పదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ధరణిని బంగాళాఖాతంలో కలిపి.. భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్నేని అంజన్‌రావు, వేణు, పుట్ట చంద్రయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషణతో కూడిన విద్యనందించడమే లక్ష్యం

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం



బడిబాటలో పాల్గొన్న అధికారులు

వేములవాడరూరల్: పోషణతో కూడిన విద్యనందించడమే లక్ష్యమని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం ఎదురుగట్లలో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో 3 నుంచి 6 ఏళ్ల పిల్లల నమోదు పెంచడం, ప్రీస్కూల్ హాజరును పెంచడం ముఖ్య ఉద్దేశమన్నారు. చదువుతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. సీడీపీవో సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- డీఐఈవో శ్రీనివాస్



తంగళ్లపల్లిలో సిరిసిల్ల బాలికల కళాశాల అధ్యాపకుల ప్రచారం

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.శ్రీనివాస్ పేర్కొన్నారు. సెస్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనజాకుమారి, అధ్యాపకులు తంగళ్లపల్లిలో బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల కంటే ప్రభుత్వ కళాశాల విద్యార్థులే అన్ని పోటీపరీక్షల్లో మంచి ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రైవేట్ కళాశాలల్లో సీటు వచ్చినా ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా చదువవచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు.

అడగండి... అడుగేయండి

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే ముందు తల్లిదండ్రులు ఆచితూచీ అడుగేయాల్సిన అవసరం ఉంది. ఆ స్కూల్ ఎలాంటిది? గతంలో స్కూల్ విద్యార్థులు సాధించిన ఫలితాలు ఎలా ఉన్నాయి? ఫీజుల వివరాలు, తల్లిదండ్రులతో యాజమాన్యం ఎలా వ్యవహరిస్తుంది? అనే వివరాలు గమనించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది పాఠశాలే కాబట్టి.. ఆలోచించి అడుగేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. జిల్లాలో 120 గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. నేటి నుంచి పాఠశాలలు పునర్‌ప్రారంభం కానుండడంతో ఇప్పటికే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. హంగు ఆర్భాటాలతో విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉపాధ్యాయులను ఇళ్లకు పంపిస్తూ పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నారు.

అనుమతులు ఉన్నాయా..

ప్రైవేటు పాఠశాల తమ వివరాలను విద్యాశాఖ కార్యాలయంలో నమోదు చేసుకొని ఉంటుంది. వారికి నిర్దిష్ట సంఖ్య, నమోదైన సంవత్సరంతో కూడిన పత్రాన్ని ఇస్తారు. దీన్ని పరిశీలించాకే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలి. కొన్ని పాఠశాలలు 1–7, 8–10 తరగతుల వరకు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది.

నోటీస్ బోర్డుపై ఇవి ఉన్నాయా..

మీరు చేర్పించబోయే ప్రైవేటు పాఠశాలలోని బోధన సిబ్బంది అర్హతలు ఎలా ఉన్నాయో గమనించాలి. అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారా? అనేది ఆరా తీయాలి. బీఈడీ, డీఈడీ వంటి విద్యార్హతలు గల వారితో విద్యాబోధన చేస్తున్నారో.. లేదో తెలుసుకోవాలి. ఉపాధ్యాయుల వివరాలు, అర్హతలను ప్రభుత్వ పాఠశాలలో మాదిరిగా ప్రైవేటు పాఠశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించారో.. లేదో చూడాలి. ఫీజుల వివరాలు ఎలా ఉన్నాయి? ఫీజుల్లో పారదర్శకత ఉందా.. అడిగి తెలుసుకోవాలి.

వసతులపై దృష్టి పెట్టండి

మెరుగైన ఫలితాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో.. లేదో తెలుసుకోవాలి. ప్రాథమిక స్థాయి నుంచి పఠనాసక్తి కలిగించే ఎలాంటి అంశాలు అమలు చేస్తున్నారో అడగాలి. స్కూల్‌లో లైబ్రరీ, ప్లేగ్రౌండ్, టాయిలెట్స్.. తాగునీటి వసతుల గురించి తెలుసుకోవాలి.



బడిలోకి వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

ఇన్నోవేటివ్ అంశాలపై..

పాఠశాలలో ఇన్నోవేటివ్ అంశాలు నేర్పిస్తున్నారా.. కొత్త విషయాలను విద్యార్థులకు తెలిసేలా తరగతులు నిర్వహిస్తున్నారా.. తెలుసుకోవాలి. గతంలో వైజ్ఞానిక ప్రదర్శనలు.. ఇన్‌స్పైర్ మానక్, సైన్స్‌మేళాల్లో భాగస్వామ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని, ప్రతిభ చాటే వారిని ఎలా ప్రోత్సాహం ఎలా ఉందో ఆరా తీయాలి. అలాంటి పాఠశాలలను తల్లిదండ్రులు ఎంపిక చేసుకోవాలి.

క్లుప్తంగా

మస్కట్‌లో యువకుడి ఆత్మహత్య

చందుర్తి(వేములవాడ): అప్పుల బాధ భరించలేక చనిపోతున్నానని వరుసకు తమ్ముడికి వాట్సాప్ మెసేజ్ చేసి ప్రాణాలు తీసుకున్నాడు ఓ యువకుడు. చందుర్తికి చెందిన కత్తి గణేశ్ (24) తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో అమ్మమ్మ పెంచి పెద్దచేసింది. జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం మస్కట్ వెళ్లాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చిన గణేశ్ 20 రోజుల క్రితం మళ్లీ మస్కట్ వెళ్లాడు. రోజు మాదిరిగానే మంగళవారం పనికి వెళ్లి వచ్చాడు. రోజురోజుకు అప్పులు పెరిగిపోతుండడంతో తీర్చే దారి లేక చనిపోతున్నానంటూ తన చిన్నాన్న కుమారుడు సన్నికి వాట్సాప్ మెసేజ్ చేసి ప్రాణాలు తీసుకున్నాడు. మృతునికి చెల్లి, అమ్మమ్మ ఉన్నారు.

పేకాట దందాతో అప్పుల ఊబిలోకి..
గణేశ్ పేకాట దందా చేసి అప్పుల ఊబిలో కూరుకుపోయాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పేకాట దందాలోకి దిగినట్లు గ్రామంలో చర్చ సాగుతోంది. పేకాటలో మోసపోయి ఉండవచ్చంటున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

చందుర్తి(వేములవాడ): మండలంలో చందుర్తి, మర్రిగడ్డలోని ఫర్టిలైజర్స్, విత్తనాల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు బుధవారం దాడులు చేశారు. పత్తి విత్తనాలతోపాటు వరి ధాన్యం విత్తనాల సంచులను పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చందుర్తి, కోనరావుపేట వ్యవసాయాధికారులు అనూష, సందీప్, ఎస్సై రమేశ్ హెచ్చరించారు. స్టాక్ వివరాలు బోర్డుపై నమోదు చేయాలని సూచించారు.

ఏబీవీపీ నాయకుల నిరసన

సిరిసిల్లటౌన్: జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలో జరుగుతున్న దోపిడీని అరికట్టడంలో అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారని ఏబీవీపీ నేతలు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో బుధవారం ధర్నాకు దిగారు. అక్రమంగా బుక్స్ అమ్ముతున్నారని ఎంఈవోకు సమాచారం ఇచ్చామన్నారు. ఏబీవీపీ డిస్ట్రిక్ట్ కన్వీనర్ లోపెల్లి రాజురావు, టౌన్ జాయింట్ సెక్రెటరీ రుద్ర వీణ, ధనుష్, పూజా, కార్తీక్ పాల్గొన్నారు.

ఆరోపణలు సరికావు
ఏబీవీపీ నేతలు విద్యాశాఖ అధికారులపై చేసిన ఆరోపణలు సరికాదని సిరిసిల్ల ఎంఈవో దూస రఘుపతి తెలిపారు. విద్యాసంస్థకు వెళ్లి చూడగా పుస్తకాలు ఏమీ దొరకలేవన్నారు. విద్యాసంస్థకు చెందిన పుస్తకాలు బయట అమ్ముతున్నారని వాటికి ట్రేడ్‌లైసెన్స్ ఉన్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వేములవాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శిక్షకుడు కృష్ణ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం 20వ వార్డు ముదిరాజ్ సంఘ భవనంలో శిక్షణనిచ్చారు. యోగాతో ఒత్తిడి దూరమై ప్రశాంతత లభిస్తుందన్నారు. డీపీఎం తిరుపతి, రిషిక, ఆశావర్కర్లు లత, హేమలత, ఉమా, విజయలక్ష్మి, జయశీల పాల్గొన్నారు.

బడి.. షాపింగ్

వేసవి సెలవులు ముగిసి.. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభంకానుండడంతో కొత్త నోట్‌బుక్స్.. యూనిఫామ్స్..షూస్ కొనుగోలు చేసేందుకు బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు దుకాణాల బాట పట్టారు. సిరిసిల్లలోని ఆయా దుకాణాలు విద్యార్థులతో రద్దీగా మారాయి. తమకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేశారు. ఇద్దరు విద్యార్థులు ఉన్న ఇంట్లో రూ.3వేల నుంచి రూ.4వేల వరకు వెచ్చించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల



సిరిసిల్లలో బుక్స్ కొంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



లగేజీ బ్యాగులు కొంటూ..



బూట్లు.. సైజ్ ఓకేనా..



పలక..బలపంతో..

ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా చేస్తా

- 50 పడకల ఆసుపత్రి, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు నిర్మిస్తా
- విద్యార్థినుల ఉన్నత విద్యకు సదుపాయాలు
- ధర్మపురి పుణ్యక్షేత్ర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సాక్షిప్రతినిధి,కరీంనగర్: తనకు రాజకీయ జన్మనిచ్చిన ధర్మపురిని నియోకవర్గాన్ని, ఇటీవల రోడ్డు ప్రమాదంలో పునర్జన్మనిచ్చిన ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి రుణాన్ని తాను ఏనాడూ తీర్చుకోలేనని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన ఆయన బుధవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

నియోజకవర్గపరంగా మీ ప్రాధాన్యాలేంటి?

అడ్లూరి: ధర్మపురి ప్రజలను, లక్ష్మీ నరసింహ స్వామిని జీవితంలో మర్చిపోను. ప్రజలు ఎమ్మెల్యేగా జన్మనిస్తే.. రోడ్డు ప్రమాదంలో స్వామి నన్ను కాపాడి పునర్జన్మనిచ్చారు. ఎన్నికల్లో ఎన్నిసార్లు ఓడినా నా అనుచరులు నా కోసమే పనిచేశారు. వారిరుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. మంత్రిగా నియోజకవర్గంలో సాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తా. విద్య, వైద్యం, సదుపాయాలకు పెద్దపీట వేస్తా. ఇక్కడి విద్యార్థినులు డిగ్రీ, పీజీ కళాశాలలు లేక జగిత్యాల, కరీంనగర్ వెళ్తున్నారు. ధర్మపురిలో డిగ్రీ, పీజీ కళాశాలలతోపాటు ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయిస్తా. చారిత్రక ధర్మపురి పుణ్యక్షేత్రానికి చీకటిపడితే రవాణా సౌకర్యం లేదు. ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. 50పడకల ఆసుపత్రి నిర్మిస్తా. ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా మారుస్తా.

మంత్రిగా భవిష్యత్ ప్రణాళికలు?

అడ్లూరి: తొలిసారి ఎమ్మెల్యే, ఆపై విప్.. ఇప్పుడు మంత్రి పదవి. పార్టీలో సామాన్య కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందనడానికి నాకు దక్కిన పదవులే నిదర్శనం. మంత్రి అయ్యాక మరింత బాధ్యత పెరిగింది. నాకు ప్రభుత్వం కేటాయించిన శాఖకు 100 శాతం న్యాయం చేస్తా. ప్రజా ఆకాంక్షల మేరకు పనిచేస్తా. ప్రతీ 30రోజులకు నా శాఖలోని పనులపై సమీక్ష చేపడతా.

మీరు మంత్రి కావడంలో కుటుంబ పాత్ర?

అడ్లూరి: నా భార్య కాంతకుమారి ప్రభుత్వ లెక్చరర్. నా రాజకీయ జీవితంలో ఆమె పాత్ర చాలా కీలకం. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్థికంగా ఇబ్బందులున్నా.. తన ఉద్యోగాన్ని, కెరీర్‌ను త్యాగం చేసి నాకు అండగా నిలిచింది. 2018లో ఓడిన సమయంలో నాలో ధైర్యం నింపింది. నా పిల్లలు కూడా వెంట నిలిచారు. వారి సహకారం మాటల్లో వర్ణించలేనిది.

పచ్చనిగుట్టల్లో 'చెత్త'మంటలు

- కలెక్టర్ నివాసం పక్కనే కాలుష్యకాసారం



రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ నివాసం సమీపంలోనే వాయుకాలుష్యం

సిరిసిల్ల: తడి, పొడి చెత్తను వేరు చేసి.. తడి చెత్తతో సేంద్రియ ఎరువులు, పొడి చెత్తను విద్యుత్ ఉత్పత్తికి పంపించాల్సి ఉండగా.. సిరిసిల్ల మున్సిపల్ అధికారులు చెత్తమంటలు రేపుతున్నారు. సిరిసిల్లలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. ఆ చెత్తను డంపుయార్డులో విభజించాలి. కానీ పొడిచెత్తను కాలబెడుతూ.. వాయుకాలుష్యానికి కారణమవుతున్నారు. మున్సిపల్ చెత్తను డంపుయార్డులో కాలబెట్టవద్దని ఉన్నతాధికారులు చెప్పినా క్షేత్రస్థాయి సిబ్బంది నిప్పుపెడుతూనే ఉన్నారు. గుట్టల్లో గుట్టుగా చెత్తమంటలు అంటిస్తున్నారు. ఇలా డంపుయార్డు నుంచి సోమవారం నుంచి దట్టమైన పొగలు వెలువడుతున్నాయి. పచ్చనిగుట్టల్లో చెత్తమంటలతో వాయుకాలుష్యం ఏర్పడుతుంది. గతంలో చెత్తను కాల్చవద్దని హెచ్చరిస్తూ డంపుయార్డు బాధ్యతలు నిర్వహించే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయడంతో కొంత కాలం చెత్తమంటలు ఆగిపోయాయి. కానీ ఇటీవల డంపుయార్డు నుంచి పొగలు వస్తున్నాయి. కలెక్టర్ నివాసం సమీపంలోనే డంపుయార్డు ఉంది. ఆ పొగంతా కలెక్టరేట్ ప్రాంతంలో వ్యాపిస్తుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పొడి చెత్తను కాల్చివేయకుండా.. డంపుయార్డు నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ముస్తాబాద్(సిరిసిల్ల): నామాపూర్‌లో స్వశక్తి మహిళలకు ఆర్‌బీఐ ద్వారా బుధవారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించినట్లు ఏపీఎం దేవరాజు తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ పొదుపు, రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు హరీశ్, కల్పన, శ్రీకాంత్, సీసీ సరోజన వీవో అధ్యక్షురాలు భారతి, షహనాజ్ పాల్గొన్నారు.

పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పద్మనగర్‌లో ఓ ఇంట్లోకి బుధవారం పాము దూరింది. భయాందోళనకు గురైన ఇంట్లోవారు స్నేక్ క్యాచర్ లింగంకు సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న లింగం తనవద్ద ఉన్న పరికరాలతో పామును పట్టుకున్నాడు. అనంతరం సీసాలో బంధించి దూర ప్రాంతాలకు తీసుకువెళ్లి విడిచిపెడతానని తెలిపాడు. ఇందిరమ్మకాలనీకి చెందిన లింగం పాములను పట్టే సొసైటీలో మెంబర్‌గా ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ బైపాస్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చంద్రంపేటకు చెందిన రాజు, శ్రీనివాస్ రగుడు బైపాస్ నుంచి వెంకటాపూర్‌కు బైక్‌పై వెళ్తున్నారు. వైద్యకళాశాల వద్ద కుక్కను తప్పించబోయి బైక్‌పై నుంచి కిందపడ్డారు. చికిత్స నిమిత్తం ఇద్దరిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విచారణ జరపాలి

ఇల్లంతకుంట(మానకొండూర్): కేంద్ర ప్రభుత్వం నిరంకుశ విధానాలు వీడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. మండలకేంద్రంలో బుధవారం జరిగిన 13వ మండల మహాసభలో పాల్గొన్నారు. సీపీఐ ఎంఎల్ మావోయిస్టు పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరారు జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, బోడ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, మంద అనిల్ కుమార్, ఆదిత్య, విష్ణు, రాజు, అఖిల్ పాల్గొన్నారు. ఈనెల 16న జిల్లా నాలుగో మహాసభలు జరగనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కోణంనేని సాంబశివరావు జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పాల్గొంటారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దశరథంగౌడ్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. జిల్లెల్లకు చెందిన కోడూరి దశరథంగౌడ్ (55) మంగళవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా రామచంద్రాపూర్‌కు చెందిన గంధం పర్శరాములు బైక్‌పై వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దశరథంను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య వెంకటవ్వ, కొడుకులు అరవింద్, అరుణ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ఆకట్టుకున్న గంగమ్మ బోనాలు



చందుర్తి/రుద్రంగి(వేములవాడ): వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ చందుర్తి మండలం బండపల్లిలో బుధవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాలు తీశారు. ఇంటికో బోనం చొప్పున 35 కుటుంబాలు గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఊరచెరువు కట్టపై ఉన్న గంగమ్మతల్లికి బోనాలతో నైవేద్యాలు చెల్లించారు. గంగపుత్ర సంఘం నాయకులు పందిరి నర్సయ్య, పందిరి లచ్చయ్య, పందిరి లక్ష్మణ్, పందిరి శ్రీనివాస్, పల్లికొండ గవాస్కర్, మధు, సతీశ్, కొండయ్య పాల్గొన్నారు. రుద్రంగిలో మండల గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ బోనాలు తీశారు.

సాంకేతిక శిక్షణ.. భవితకు నిచ్చెన

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- టైలరింగ్, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్‌లలో 42 రోజులపాటు తర్ఫీదు
- పూర్తి చేసిన 89 మంది పురుషులు, 680 మంది మహిళలు



శిక్షణలో పాల్గొన్న మహిళలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): తమ చిన్ననాటి కలలను ఇప్పుడు సాకారం చేసుకుంటున్నామని కొందరు.. నేర్చుకుంటున్న కళను ఇంకా మెరుగుపర్చుకుందామని మరికొందరు.. స్కూల్‌లో పిల్లలకు పెట్టే టాస్క్‌లో మేము సైతం సాయం చేద్దామని ఇంకొందరు.. ఉపాధి కోసమని.. ఉద్యోగం సాధించాలని.. పది మందికి ఉపాధి కల్పించాలని ఇలా ఎవరికి వారు తమ ఆశయాలు, లక్ష్యం సార్థకం చేసుకునేందుకు సిద్ధమయ్యారు నారీమణులు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ కళలకు వయస్సుతో సంబంధం లేదని కరీంనగర్ మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సాంకేతిక ఉపాధ్యాయ శిక్షణ కోర్సు(టీటీసీసీ)లో ఉత్సాహంగా పాల్గొన్నారు మహిళలు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ పొందారు. 42 రోజులపాటు సాగిన కోర్సు బుధవారంతో పూర్తయింది. ఈక్రమంలో శిక్షణ పొందిన మహిళల అనుభవాలు, భవిష్యత్ కార్యాచరణపై సాక్షి ప్రత్యేక కథనం.

42 రోజుల శిక్షణ

ధన్గర్‌వాడీ పాఠశాలలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కొమురంభీం, మంచిర్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల నుంచి 89 మంది పురుషులు, 680 మంది మహిళలు మొత్తం 769 మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పొందారు. మే 1న కోర్సు ప్రారంభించగా.. జూన్ 11తో ముగిసింది. టైలరింగ్, డ్రాయింగ్, ఆర్ట్, క్రాఫ్ట్‌లలో 42 రోజులపాటు శిక్షణ పొందారు. 469 మంది డ్రాయింగ్‌లో, 360 మంది టైలరింగ్, క్రాఫ్ట్‌లలో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ కోర్సు డైరెక్టర్ బొట్ల రామస్వామి పర్యవేక్షణలో టీటీసీసీ శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా పూర్తయ్యాయి.



డ్రాయింగ్, క్రాఫ్ట్ తదితర వాటిల్లో శిక్షణ పొందుతున్న మహిళలు

ఆర్ట్‌లో నైపుణ్యం సాధించా



ఎంటెక్ పూర్తి చేశా. ప్రస్తుతం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా. ఆర్ట్, డ్రాయింగ్ అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. కోర్సులో భాగంగా చాలా రకాల వాటిని తయారు చేశా. కలెక్టర్ కూడా ఇంప్రెస్ అయ్యారు.

– హెచ్.రోజా, కరీంనగర్

క్రాఫ్ట్ వర్క్ నేర్చుకున్నా



కరీంనగర్‌లో జరిగిన టీటీసీసీలో ప్రతిరోజు క్లాసులకు హాజరయ్యా. క్రాఫ్ట్ వర్క్ బాగా నేర్చుకున్నా. పూల బుట్టి, ఆకులతో పలు రకాల వస్తువులు తయారు చేశా. బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశా. ఇలాంటి కోర్సులు మాకు ఉపాధినిచ్చే విధంగా ఉన్నాయి. ప్రతీ ఒక్కరు కోర్సు చేయాలి.

– ఎల్.లక్ష్మి, ఇందారం, మంచిర్యాల

టైలరింగ్‌లో శిక్షణ



బీకామ్ డిగ్రీ చేశా. గతంలో శిశు గృహ తదితర సంస్థల్లో పని చేశా. కోర్సు పూర్తి చేసి స్కూళ్లలో చిన్నారులకు నేర్పించాలనుకుంటున్నా. టైలరింగ్‌లో అల్లికలు తదితర వాటిని బాగా నేర్చుకున్నా. ట్రైనర్స్ బాగా చెప్పారు. ప్రతీ ఒక్కరికి ఉపయోగపడే శిక్షణ ఇది.

– ఇ.సంధ్య, గాలిపెల్లి, సిరిసిల్ల

ఉత్సాహంగా హాజరు



2016 నుంచి టీటీసీసీలో టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. ప్రతిరోజు సుమారు 700 మందికి పైగా హాజరవుతున్నారు. ప్రస్తుతం కరీంనగర్ డాక్టర్ స్ట్రీట్‌లోని బాలికల పాఠశాలలో పని చేస్తున్నా. శిక్షణ కోర్సుల్లో చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చాలామందికి ఉపయోగపడే కోర్సు ఇది. ప్రతి సంవత్సరం శిక్షణకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుండడం విశేషం.

– కె.సుజాత, టైలరింగ్ ట్రైనర్

విజయవంతంగా పూర్తి



కరీంనర్ వేదికగా 42 రోజులపాటు విజయవంతంగా కోర్సు జరిగింది. పెద్ద సంఖ్యలో పురుషులు, మహిళలు హాజరయ్యారు. కోర్సులో భాగంగా పలువురు మహిళలు అద్భుతాలను సృష్టించేవిధంగా వస్తువులను తయారు చేసి అలరించారు. కోర్సు చేసిన పాఠశాల వాతవరణాన్ని పూర్తిగా మార్చేశారు. సొంతంగా పాఠశాల గోడలకు అద్భుతమైన చిత్రాలను వేశారు. ఎందరికో ఉపాధినిచ్చే ఇలాంటి కోర్సులను ప్రతీ ఒక్కరు పూర్తి చేయాలి.

– బొట్ల రామస్వామి, కోర్సు డైరెక్టర్

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం వరదవెల్లిగుట్టపై స్వయంభూగా వెలసిన గురు దత్తాత్రేయస్వామి ఆలయంలో బుధవారం గిరిప్రదక్షిణ ప్రారంభించారు. తొలిసారి పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గిరిప్రదక్షిణలో సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు.

సూర్యాస్తమయం.. స్వర్ణ శోభితం



గంభీరావుపేట(సిరిసిల్ల): చేయి తిరిగిన చిత్రకారుడు కుంచెతో గీసినట్లు ఉన్న ఈ బంగారు వర్ణం ఆకాశం గంభీరావుపేట మండలం గోరింటాల గ్రామ శివారులో కనిపించింది. బంగారు, ఆరేంజ్ రంగులు కలిసిన ఆకాశం చూడముచ్చటగొలిపింది. ఆ వర్ణాల మధ్యలో ఆకాశాన్ని తాకినట్లు కనిపిస్తున్న తాటిచెట్లు మరింత అందాన్ని చేకూర్చాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబర్చారు.